# మినీ కథలు :



## నిన్ను ప్రేమిస్తున్నాను

'శిరీష'

శారద వాళ్ళు మా ప్రక్కవాటాలో అద్దెకు దిగి నెల రోజులు కావస్తుంది. అప్పటి నుంచి శారదను గమనిస్తున్నాను. అవకాశం ఉన్నప్పుడల్లా ఎదురుపడి చిరునవ్వొకటి విసిరేస్తున్నాను. కొత్తేమో అందుకుందో లేదో చూడలేదు.

శారద నిజానికి అందంగా ఉంటుంది. అందుకే ఆమెను చూసిన నాటి దగ్గరనుంచి నా మనసు ఆమెమీదే లగ్నమై ఉంది.

ఆమెకూ తెలుపంటే ఇష్టమే. నాకూ అంతే. ఆమెకు తీపి ఎక్కువ ఇష్టం. నాకూ అంతే. ఆమె అభిమానించే రచయితా, నేను అభిమానించే రచయితా ఒకరే. నేను ఇష్టపడే ఆర్టిస్టు, శారద ఇష్టపడే ఆర్టిస్టూ అంతా ఒకరే. నేను సైన్సు గ్రూపు, ఆమె ఆర్ట్సు గ్రూపు అదొక్కటే తేడా.

ప్రతిరోజు నా మనసు ఆమెను ప్రేమిస్తూంది. ఎలా అయినా మాట్లాడాలనికూడా తహతహ లాడుతుంది.

ఒకరోజు నాన్న ఆఫీసుకు వెళ్ళారు. అమ్మ ఎక్కడో మహిళామండలి మీటింగుందంటే వెళ్ళింది. ఆ రోజు ఏర్పడిన ఏకాంతానికి పొంగిపోయాను. శారదకు కబురు పెడితే సంకోచం లేకుండానే వచ్చింది. వచ్చిందన్న మాటేగాని చాల సేపు నేను ఏమీ మాట్లాడలేకపోయాను,

"ఎందుకు పిలిచారు" అడిగింది శారద.

"మాట్లాడదామని" అన్నాను నేను బెరుకుగా.

"అయితే మాట్లాడండి" నవ్వింది.

"నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకుంటాను. ఈ రోజు సినీమాకు వెళ్దాం అని చెప్పాలనిపించింది. కాని మాట్లాడలేకపోయాను." "మీరంటే నాకు చాలా ఇష్టం" అన్నాను ధైర్యంగా కాలరు సర్దుకుని.

"మీరంటే నాకూ ఇష్టమే" ఆమెకూడా అంగీకారం తెలిపింది.

"నేను ప్రేమిస్తున్నాను" గొంతుతడారింది నాకు. కాళ్ళు వణికాయి.

ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనంగా కూర్చుంది.

"నేనంటే ఇష్టమే అన్నారు" మళ్ళీ నేనే అన్నాను.

"మీది మాది వేరువేరు కులాలు" సంశయంగా మాటలు మధ్యలోనే ఆపేసింది.

"మనం యువకులం. కులం. మతం మనకొద్దు" ఉపన్యాసం ఇవ్వాలనుకున్నాను. అంతలోనే అమ్మ గేటు తీసుకుని అప్పటికే గుమ్మంలోనికి అడుగు పెట్టింది. కళ్లార్పకుండా ఇద్దర్నీ చూసింది.

శారద బిడియపడుతూ మీదికిలేచి వెళ్ళబోయింది.

"ఆగమ్మా" అమ్మ ఆజ్ఞలాంటి మాట వదిలింది.

నా కాళ్ళు వణుకుతున్నాయి. శారద ముఖం దించుకుని నేలమీద తన కాలివేళ్ళవైపు పరిశీలనగా చూస్తుంది.

"వెళ్ళిపోతున్నావేం. కూర్చో" అంది అమ్మ.

ఆ మాటలో ద్వంద్వంగాని, విపరీతార్థంగాని గోచరించలేదు. కంగారుపడ్డ గుండె కండిషనులో కొచ్చింది.

"ఎవరూ లేకపోతే మావాడికి-అదే-మీ అన్నయ్యకు ఏం తోచదు. చెల్లి లేచి వెళ్ళిపోతుంటే అలా చూస్తావేంరా! కూర్చోమను" అమ్మ ఇంట్లోకి పోయింది.

శారద వడివడిగా పోయింది.

తెరచిన నా నోరు ఆశ్చర్యంతో అలాగే వుండిపోయింది చాలా సేపు. ★